క్లుప్తంగా

పోతునూరులో ఇంటింటా జ్వరాల సర్వే



పోతునూరులో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: పోతునూరు పరిధిలో ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహిస్తున్నామని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. వరదలు, వర్షాలవల్ల అంటు వ్యాధులు ప్రబల కుండా ఆరోగ్య సూత్రాలు పాటించేందుకు, వైరల్ ఫీవర్స్ పరిస్థితి తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు.గృహ యజమానులు, వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు.

వైభవంగా వేళాంకణి ఆరోగ్యమాత ఉత్సవాలు



వేళాంకణి ఆరోగ్యమాత ఉత్సవాల్లో మాట్లాడుతున్న కెథ్రడల్ రెక్టార్ ఫాదర్ ఐ. మైఖేల్

దెందులూరు: విశ్వాసం ప్రతి ఒక్కరిలో మార్పును, రక్షణను కల్పిస్తుందని ఫాదర్ ఐ.మైఖేల్ అన్నారు. మండలంలోని గోపన్న పాలెం పంచాయతీ వేగవరం ఆర్‌సీఎం ఫారిస్ క్రిస్ట్ ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో వేళాంకణి ఆరోగ్యమాత ఉత్సవాలు ఘనంగా కొనసా గుతున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన రెక్టార్ మాట్లాడుతూ వేగవరం విచారణ, విశ్వాసులు, సంఘం అభినందనీయులన్నారు. విచారణాభి వృద్ధికి పీఠాధిపతులు డాక్టర్ పొలిమేర జయ రావు విశేష కృషి చేస్తున్నారన్నారు. మోజెస్, మైఖేల్, ఇతర గురువులు, సిస్టర్లు ప్రత్యేక దివ్య పూజాబలి అర్పించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



దోసపాడు వైద్యశిబిరంలో సేవలందిస్తున్న దృశ్యం

దెందులూరు: పోతునూరు పీహెచ్‌సీ, గోపన్న పాలెం పీహెచ్‌సీ పరిధిలో అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాకేష్ అన్నారు. ఆదివారం వైద్యాధికారులు మాట్లా డుతూ కలెక్టర్ వెట్రిసెల్వి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్ శర్మిష్ట ఆదేశాల మేరకు ప్రతి గ్రామ శివారు ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందించడంతోపాటు మందులు పంపిణీ చేస్తామన్నారు.

గండి పూడ్చివేత

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహి స్తున్న విషయం తెల్సిందే. రెవెన్యూ యంత్రాం గం అప్రమత్తతో పనిచేస్తోంది. ఉంగుటూరు మండలం నల్లమాడు చెరువు గట్టుకు యర్రమి ల్లిపాడు వద్ద రంధ్రం పడింది. ఆ విషయం తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు దృష్టికి రావ డంతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి నల్ల మాడుచెరువు గట్టుకు చేరుకుని గండిని పూడ్చించారు. నల్లమాడు వీఆర్వో నాగరాజు, పంచాయతీ సెక్రటరీ సురేష్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ సిబ్బంది, నల్లమాడు సర్పంచి రాము, యర్రమిల్లిపాడు సర్పంచి తమ్మిన శ్రీను, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు మృతి



నిడమర్రు: బువ్వనపల్లి మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు (80) అనా రోగ్యంతో బాధపడు తూ శనివారం స్వగ్రా మం బువ్వనపల్లిలోని ఉదయం మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పుప్పాల వాసుబాబుకు స్వయాన మేనమామ. పుల్లారావు సర్పంచ్‌గా 1995–2000 కాలంలో బువ్వనపల్లి గ్రామాభి వృద్ధికి కృషి చేశారు. బువ్వనపల్లి గ్రామ దేవత వడలమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడిగా 50 ఏళ్లుగా సేవలందిస్తూ నూతన ఆలయ నిర్మాణానికి, ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. పుల్లారావు మృతిపట్ల పలువురు జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు ప్రగాఢ సం తాపం తెలిపారు.

రేపు జాబ్ మేళా

భీమడోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, స్కిల్ హబ్ కళాశాల ఇన్‌చార్జి జం గం రాములు అన్నారు. పలు కంపెనీల ప్రతిని ధులు పాల్గొంటారని వారు ఆదివారం వెల్లడిం చారు. ఆసక్తి గల యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని అన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల నిరుద్యోగులు జాబ్ మేళా హాజరు కావాలని వారు కోరారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బలివే, శ్రీపర్రు వంతెనల నిర్మాణం
- లక్షలాది మందికి వరద ప్రభావం నుంచి విముక్తి



విజయరాయిలో రూ.14 కోట్లతో నిర్మించిన వంతెన



విశాలంగా నిర్మించిన స్నాన ఘట్టం



వందలాది గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా రూ.33 కోట్లతో నిర్మించిన శ్రీపర్రు వంతెన

దెందులూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవ, ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలు, పూర్తిచేసిన నిర్మాణాల కారణంగా దెందులూరు నియోజకవర్గం నేడు వరదల తాకిడికి గురికాకుండా సురక్షితంగా ఉంది. దీంతో లక్షలాది మంది ప్రయాణీకులు, ప్రజలు గండం ఇబ్బందులకు గురికాకుండా రక్షణ పొందారు. వివరాల్లోకి వెళితే నియోజకవర్గంలో పెదవేగి మండలంలో రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన బలివే పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రాంతంలో వంతెన నిర్మాణం, ఏలూరు రూరల్ మండలంలో శ్రీపర్రు వద్ద వంతెన నిర్మాణం మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషితో నిర్మితమయ్యాయి. లక్షలాది మంది ప్రజలు, ప్రయాణీకులకు జరగబోయే ప్రమాదాన్ని అబ్బయ్యచౌదరి వివరించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి నిధులు మంజూరు చేయించారు. వెంటనే రెండు మండలాల్లో వంతెన నిర్మాణాలు చకచకా పూర్తి చేయించారు. ఈ వంతెనల నిర్మాణాలు జరగకపోతే నేడు రెండువైపులా రాకపోకలు నిలిచిపోయేవి. అనేక ప్రమాదాలు జరిగేవి.

దెందులూరు నియోజకవర్గంలో ఏళ్లనాటి సమస్యలుగా ఉన్న పెదవేగి మండలంలో బలివేకు వంతెన, ఏలూరు రూరల్ మండలంలో శ్రీపర్రు వంతెన నిర్మాలు సాకారమయ్యాయి. 2019 ముందు శివరాత్రికి బలివే వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. తెల్లవారుజామున స్నానమాచరించడానికి భక్తులు ఇక్కట్లు పడేవారు. పెదవేగి– ముసునూరు మండలాల్లో రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి గాంచి శైవక్షేత్రం బలివేకు వెళ్లడానికి విజయరాయి వద్ద రూ.14 కోట్లతో రెండు ఎడమ, కుడివైపు స్నానఘట్టాలు, వంతెన నిర్మాణం 90 శాతం పనులు పూర్తి చేశారు. ఏటా శివరాత్రికి బలివేపుణ్యక్షేత్రానికి ఖమ్మం, ఏలూరు జిల్లా, ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మందికిపైగా భక్తులు ఈ పుణ్యక్షేత్రానికి వస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు స్నానఘట్టాలు, వంతెన భక్తుల మనోభావాలకు విలువనిచ్చి నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన రోజుల్లో పాఠశాలలకు, పొలాలకు, ఇతర పనులకు వెళ్లే ప్రజలు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వంతెన నిర్మాణం చేశారు. ఈ వంతెన నిర్మాణం ద్వారా లక్షలాది మంది ప్రజలు ప్రయాణ సౌకర్యం కలిగింది.

- ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు వద్ద ఏలూరు– కైకలూరు, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి వర్షాకాలంలోనూ వేలాది మంది ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవించే వారు. దీంతో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరిస్థితిని సీఎంకు వివరించి శ్రీపర్రులో అప్రోచ్ రోడ్లు రూ. 33 కోట్లతో వంతెన నిర్మాణం చేశారు. ఈ వంతెన నిర్మాణం వల్ల లక్షలాది మంది ప్రయాణీకులు, వాహనదారులు, విద్యార్థులు, రైతులు, కూలీలకు సౌకర్యం, భద్రత లభించింది. దెందులూరు నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా దశాబ్దాల కాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న ప్రధానమైన సమస్యలను అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవతో ఒక్క నియోజకవర్గ ప్రజలే కాకుండా సమీప నియోజకవర్గాల ప్రజలకు, భక్తులకు, వాహనదారులకు శాశ్వత మేలు జరిగేలా కృషి చేశారు.

సమస్యకు పరిష్కారం చూపారు



రాష్ట్రంలో బలివే మహాశివరాత్రికి అత్యంత ప్రసిద్ధిగాంచింది. ఏటా శివరాత్రిరోజున లక్షకుపైగా భక్తులు వస్తారు. విజయరాయి వద్ద వంతెన, రెండు వైపులా స్నానఘట్టాలు నిర్మించి మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించారు.

– తాతా రమ్యశ్రీ కుమార్, పెదవేగి ఎంపీపీ

కొల్లేరు ప్రజలు ఎంతో మేలు



ఏలూరు మండలంతో పాటు 7,8 మండలాలకు దశాబ్దాల కాలంగా శ్రీపర్రు వంతెన తీరని సమస్యగా ఉంది. ఏటా వర్షాకాలం, వరదలు వచ్చినప్పుడు రాకపోకలు ప్రశ్నార్థకంగా ఉండేవి. రైతులు, విద్యార్థులు, కూలీలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొల్లేరులో లక్షలాది మంది ప్రయాణీకులు ఈ వంతెన నిర్మించడంతో మేలు చేశారు.

– పళ్లెం ప్రసాద్, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్

లోతట్టు ప్రాంతాల్లో పోలీసు ఉన్నతాధికారుల పర్యటన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ కిశోర్

పెదపాడు: పెదపాడు మండలంలోని పలు లోట్టు ప్రాంతాలను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కే ప్రతాప్ శివ కిశోర్ పరిశీలించారు. పెదపాడు మండలంలోని పాతపెదపాడు, కొనికి, సత్యవోలు, నాయుడుగూడెం, వడ్డిగూడెం, గుడిపాడు గ్రామాల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలకు చేరడంతో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో వరద నీటి పరిస్థితిని పరిశీలించారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వరదనీరుకు ఎదురుగా వెళ్లరాదని, వరదను అంచనావేస్తూ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. బుడమేరుకు వచ్చిన వరద నీరు, పెదపాడు మండలం మీదుగా కొల్లేరు సరస్సును కలిసే పెదపాడు మండలంలోని పలు గ్రామాలు ముంపుకు గురైన నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి తగిన సూచనలు సలహాలు సూచనలు అందించారు. కొణికి గ్రామంలో క్షేత్రస్థాయిలో నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఐజీ, ఎస్పీలను కలిసి పెదపాడు మండలంలోని మూడు గ్రామాలు, ఏలూరు మండలంలో 18 గ్రామాలకు వరదనీరు వచ్చి చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ, పెదపాడు సీఐ నబీ, పెదపాడు ఎస్సై శుభశేఖర్ పాల్గొన్నారు.

లంబోదరుడికి విశేష పూజలు



భీమడోలులో ట్రాక్టర్‌పై గణనాథుని ఊరేగింపు



దెందులూరు: నూపాటిలో గణేశ్ ఉత్సవాలు

భీమడోలు: వినాయక చవితి పర్వదినాన్ని శనివారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పందిళ్లు, ఆలయాల్లో కొలువైన లంబోదరుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని విశేష పూజలు చేశారు. భీమడోలు, గుండుగొలను, పూళ్లతో పాటు ప్రతి గ్రామంలోనూ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. భీమడోలు గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 60వ వార్షిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అంబర్‌పేట నుంచి మట్టి వినాయకుని వెండి ఆభరణాలతో ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకుని వచ్చారు. భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం, వడ్లపట్ల తదితర గ్రామాల్లోని గణనాథుడిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకున్నారు. భీమడోలు గణపతి సెంటర్‌లోని గణనాథుడు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

గ్రామాల్లో ఉత్సవాల సందడి



భీమడోలు: ప్రత్యేక అలంకరణలో మన్మహా గణనాథుడు

ఉంగుటూరు: మండలంలో గణేశ్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నారాయణపురంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో 72 ఏళ్లగా గణేశ్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు శనివారం ఉత్సవ మందిరానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అడపా శ్రీను, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువాకప్పి సత్కరించారు. నాచుగుంట, యర్రమళ్ల, పాటిమీద, నారాయణపురం, చేబ్రోలు, కైకరం తదితర గ్రామాల్లో వినాయకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఘనంగా వినాయకచవితి ఉత్సవాలు

దెందులూరు: గోపన్నపాలెంలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకచవితి 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వైద్యుడు జి. శరత్‌బాబును కమిటీ సభ్యులు సత్కరించారు. దెందులూరు నూపాటిలో వినాయకుని విగ్రహానికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి ఉత్సవాలు నిర్వహించారు. వినాయకుని ఆలయాలకు ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలు, అరటిచెట్లు ఏర్పాటు చేశారు.

అక్షరాస్యత వృద్ధికి అందరూ కృషి చేయాలి



భీమడోలులో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న డీడీ జీ సీహెచ్ ప్రభాకరరావు

భీమడోలు: ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు జీసీహెచ్ ప్రభాకరరావు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. బహుభాషా వాదం ద్వారా అక్షరాస్యతను ప్రోత్సహించడం అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడీ ప్రభాకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అక్షరాస్యతను పెంచేందుకు ఉల్లాస్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యత అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్వాకా మహిళలు అక్షరాస్యులుగా మారాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందించారు. అక్షరాస్యతకు తమ వంతు చేసిన ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఏపీఎం సురేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్ పి.విజయసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.శ్రీలక్ష్మి, ఏపీడీ విజయకుమార్, నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా వారాల పండుగ





భీమడోలులో ఆకట్టుకున్న విచిత్ర శక్తి వేషాలు, ప్రభ ఊరేగింపులో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు

భీమడోలు: గుండుగొలను, భీమడోలు గ్రామాల్లో ఆదివారం వారాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గంగానమ్మ తల్లి భారీ ప్రభలను విశేషంగా అలంకరించి ఎడ్లబండ్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గంగానమ్మ తల్లిని తమ ఇలువేల్పుగా స్థానికులు పూజిస్తారు. ప్రజలు ఏటా వినాయక చవితి మరుసటి రోజు వారాల పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. బంధుమిత్రులు తరలిరావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రభల వెంట శక్తి వేషాలు, గరగ నృత్యాలు, కోలాటం తదితర నృత్య ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గ్రామంలోని గంగానమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

పెదపాడు: వరద బాధితులకు పెదపాడు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది దుప్పట్లు పంపిణీ చేశారు. ఇటీవల విజయవాడలో బుడమేరు ప్రవాహం ఉధృతి కారణంగా ముంపునకు గురైన వరద బాధితులకు పెదపాడు పీహెచ్‌సీ వైద్యుడు అనంతపాల్, హెల్త్ అసిస్టెంట్ సురేష్ తదితరులు ఆర్థిక సాయంతో పీహెచ్‌సీ తరపున దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడలో పాల ప్యాకెట్ల పంపిణీ

ఉంగుటూరు: నారాయణపురానికి చెందిన నేకూరి సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ టీము సభ్యులు విజయవాడలోని కండ్రిక ప్రాంతంలో పాల ప్యాకెట్లు ఇతర ఆహార పదార్థాలు ఆదివారం పంపిణీ చేశారు. జలమయమైన ఆ ప్రాంతంలో ఇళ్లల్లోకి వెళ్లి బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలు, పాల ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నూకేరి లక్ష్మణరావు, మైకేల్ విజయకుమార్, అనురాధ, బెంగుళూరు కమార్ స్వామి, పెద్దమూర్తి రాజు, అనిమిల్లి సుధీర్, కొల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

నిమ్మల మస్తాన్‌రావు చిరస్మరణీయుడు



నిమ్మల మస్తాన్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిడమర్రు: అడవికొలను గ్రామాభివృద్ధికి కృషి చేసిన దాత నిమ్మల మస్తాన్‌రావు విగ్రహావిష్కరణ గ్రామంలోని దుర్గమ గుడి సెంటర్లో గ్రామ పెద్దలు ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సమకూర్చిన స్టేట్ హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా వీరభద్రరావు దంపతులను గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మస్తాన్‌రావు గ్రామంలో గ్రామ శ్మశాన వాటిక షెడ్లు, బస్టాండ్ నిర్మాణంతోపాటు గ్రామంలో వినాయకుని ఆలయం నిర్మించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మస్తాన్‌రావు జ్ఞాపకార్థం 100 మందికి దుప్పట్లు, చీరలను జిల్లా దంపతులు పంపిణీ చేశారు. నిమ్మల సుబ్బారావు, సర్పంచ్ పాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మజ్జి శ్రీను, పి.వెంకట సుబ్బరావు, నిమ్మల రమేష్, గరువు సుబ్బారావు, అందే సత్యనారాయణ తదితరులున్నారు.

కొల్లేరుకు పెరుగుతున్న వరద ముంపు

- ఉప్పుటేరు ఎగదన్నడంతో పెరుగుతున్న నీటిమట్టం
- భారీ వర్షాలతో ఆందోళనలో కొల్లేరు గ్రామాలు



నిడమర్రు: అడవికొలను 5వ కాంటూరు పరిధిలో కొల్లేరు రహదారులపై వరదనీరు

నిడమర్రు: కొల్లేరు సరస్సులో ముంపు రోజురోజుకూ పెరుగుతూ 5వ కాంటూరు వరకూ ముంపు పెరుగుతూ స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. మరో పక్క ఆదివారం వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ఆక్వా, వరి రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే కొల్లేరులోని 3వ కాంటూరుకు వెళ్లే అన్ని రహదారులపైకి ఆదివారం ఉదయానికి 2నుంచి 5 అడుగుల నీరు చేరింది. మరో పక్క 3వ కాంటూరు పరిధిలో అనధికారికంగా చేపల సాగు చేస్తున్న ఆక్వా చెరువుల గట్ల వరకూ వరద నీరు చేరింది. కొన్ని చోట్ల ఆక్వా చెరువుల నుంచి చేపలు కొల్లేరులో కలిసిపోయినట్లు రైతులు చెపుతున్నారు. ఉప్పుటేరు కూడా ఆక్రమణలకు గురికావడంతో సరస్సు నుంచి వెళ్లే వరద నీరు సముద్రంలోకి వెళ్లకుండా అవరోధాన్ని సృష్టిస్తోందని అధికారులు చెప్పారు. దీంతో అడవికొలను. క్రొవ్విడి, పెదనింద్రకొలను, తోలకపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, చానమిల్లి గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతామని రైతులు చెపుతున్నారు. ఉప్పుటేరు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూడు వంటి వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని మండలంలోని కొల్లేరు రైతులు కోరుతున్నారు.

3,150 ఎకరాల్లో పంట మునక

దెందులూరు: వర్షాలు, వరదలకు ఏలూరు డివిజన్‌లో 3,150 ఎకరాలు ముంపునకు గురయ్యాయని వ్యవసాయశాఖ జిల్లా అధికారి హబీబ్ బాషా అన్నారు. ఆదివారం అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, మండలి వ్యవసాయశాఖ అధికారులతో కలిసి నియోజకవర్గంలో దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు గ్రామాల్లో ముంపుబారిన పడిన పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులను పరామర్శించారు. వివరాలు అడిగి నమోదు చేశారు. అకాల వర్షాలు, వరదలకు వేలాది ఎకరాల పంట, రైతులు, కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెండు మూడు రోజుల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.



నిడమర్రు: అడవికొలనులో కొల్లేరు ఎగదన్నడంతో జలమయంలో కొల్లేరు పరిధిలోని ఆక్వా చెరువులు



దెందులూరు: ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హబీబ్ బాషా, ఏడీ సుబ్బారావు